క్లుప్తంగా

1 నుంచి వార్డుల్లో అధికారుల పర్యటన

ముమ్మిడివరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా జూలై 1వ తేదీ నుంచి వార్డు సచివాలయాల పరిధిలో అధికారుల బృందం పర్యటిస్తుందని ముమ్మిడివరం నగర పంచాయతీ కమిషనర్ జి.లోవరాజు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సంక్షేమ పథకాల అమలులో నెలకొన్న సమస్యల పరిష్కారమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. వార్డుల వారీగా అధికారుల పర్యటన షెడ్యూలను ఆయన ప్రకటించారు. ఈ నెల 1న సూరాయి చెరువు సచివాలయం, 4న రాయుడువారిపాలెం, 7న రాజుపాలెం, 12న పల్లిపాలెం, 15న బొండాయి కోడు, 19న పోలమ్మ చెరువు, 21న గొల్లల వీధి సచివాలయ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ అధికారులు పర్యటిస్తారని కమిషనర్ లోవరాజు తెలిపారు.

సత్తెమ్మ సన్నిధికి పోటెత్తిన భక్తులు


సీహెచ్ గున్నేపల్లి సత్తెమ్మ అమ్మవారు

ముమ్మిడివరం: మండలంలోని సీహెచ్ గున్నేపల్లి సత్తెమ్మ తల్లి అమ్మవారి సన్నిధికి భక్తులు పోటెత్తారు. ఆషాడ మాసం మొదటి ఆదివారం కావడంతో జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఆలయ నిర్వాహకులు ఆలయ ప్రాంగణంలో షెడ్లు, వాటర్ ప్రూఫు టెంట్‌లు ఏర్పాటు చేశారు. అనంతరం దాతల సహకారంతో భక్తులకు ఉచిత పులిహోర, చంటి పిల్లలకు పాలు పంపిణీ చేశారు.

ఘనంగా గ్రామదేవత జాతర


ప్రత్యేక అలంకరణలో రేణుక ఎల్లమ్మ అమ్మవారు

ఉప్పలగుప్తం: మండలంలోని పెదగాడవిల్లిలో కొలువై ఉన్న గ్రామదేవత రేణుక ఎల్లమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు ఆదివారం నిర్వహించారు. మొదటి వార్షికోత్సవం సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. పసుపు, కుంకుమలతో పూజలు నిర్వహించి, నైవేద్యాలు చెల్లించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొన్ని అమ్మవారిని దర్శించుకున్నారు.

మేధావుల సదస్సు

అమలాపురం రూరల్: స్థానిక ప్రెస్ క్లబ్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రి చిట్టిబాబు అధ్యక్షతన మేధావుల సదస్సు ఆదివారం నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీ వేమా, రైల్వే పోరాట సమితి నాయకులు వీఆర్ సుబ్రహ్మణ్యం, ఉప్పుగంటి భాస్కరరావు, డాక్టర్ అయ్యగారివెంకటేశ్వరరావు ముఖ్య అతిథులుగా పాల్గొని రక్షణ రంగం, ఆర్థిక అభివృద్ధి, వ్యవసాయ రంగం, విద్యారంగంలో ప్రధాని మోదీ తొమ్మిదేళ్ల పాలనలో చేసిన అభివృద్ధిని వివరించారు. అనంతరం డాక్టర్ అయ్యగారి వెంకటేశ్వరరావును సత్కరించారు. సమావేశంలో బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లా పవన్ కుమార్, అల్లా భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

పంట కాలువలో వ్యర్థ జలాలు వదిలితే సహించం

తాళ్లరేవు: కోరంగి పంచాయతీ పెదబొడ్డు వెంకటాయపాలెం పంట కాలువలో రొయ్యల కంపెనీల వ్యర్థ జలాలను వదిలితే సహించబోమని స్థానిక ఎంపీటీసీ సభ్యుడు పాలెపు పోసియ్య, పంచాయతీ ఉప సర్పంచ్ కామాడి భైరవమూర్తిలు హెచ్చరించారు. పంట కాలువలో కలుషిత జలాలు కలుస్తుండడంపై స్థానికులు ఫిర్యాదు చేయడంతో ఆదివారం వారు పంట కాలువను పరిశీలించారు. కలుషిత జలాలు కలవడంతో పంట కాలువ ద్వారా సరఫరా అయ్యే తాగునీరు కలుషితమయ్యే ప్రమాదముందన్నారు. కాలువకు ఇరువైపులా ఉన్న రొయ్యల కంపెనీల పైపులైన్‌లను తొలగించాలని డిమాండ్ చేశారు.

స్కాలర్‌షిప్‌లు మంజూరు చేయాలి

యానాం: నియోజకవర్గ పరిధిలో వివిధ జూనియర్ కళాశాలలు, పలు విద్యా సంస్థల్లో చదువుతున్న ఎస్సీ విద్యార్థులకు 2022–23 విద్యా సంవత్సరానికి గాను పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్‌లు త్వరగా మంజూరు చేయాలని పలువురు విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్యాంకు ఖాతాలకు కేవైసీ ప్రక్రియ పూర్తి కాక స్కాలర్ షిప్ నగదు అకౌంట్లలో జమ కాలేదన్నారు. ఆది ద్రావిడ శాఖ అధికారులు చర్యలు తీసుకుని స్కాలర్‌షిప్ మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

సెల్‌ఫోన్‌లు, బైక్ చోరీ

అంబాజీపేట: మండలంలో రెండు సెల్ ఫోన్‌లు, బైక్ చోరీకి గురయ్యాయి. మాచవరం శివారు గణేష్ కాలనీలో వాసంశెట్టి మురళీకృష్ణ ఇంటిలో ఉన్న రెండు సెల్‌ఫోన్లు ఆదివారం తెల్లవారుజామున చోరీకి గురయ్యాయి. అంబాజీపేట స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటీఎం ఎదురుగా తూరంగికి చెందిన గుర్రం అశోక్‌కు చెందిన గ్లామర్ బైక్ చోరీకి గురైంది. వీరు ఇరువురు పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

రిజర్వేషన్ కౌంటర్ సేవలు యథాతథం

- రైల్వే శాఖ నుంచి హెడ్ పోస్టాఫీసుకు బదలాయింపు
- సర్క్యులర్ బజార్‌లోని కౌంటర్‌ను ఖాళీ చేసిన రైల్వే శాఖ


అమలాపురం హెడ్ పోస్టాఫీసులో కొత్తగా ఏర్పాటుచేసిన రైల్వే రిజర్వేషన్ కౌంటర్

అమలాపురం టౌన్: గత 22 ఏళ్లగా అమలాపురం సర్క్యులర్ బజార్ (మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్)లో కోనసీమ ప్రజలకు సేవలు అందించిన రైల్వే రిజర్వేషన్ కౌంటర్‌ను ఆ శాఖ నిర్వహణా భారంతో విరమించుకుంది. ఆదే కౌంటర్ స్థానిక హెడ్ పోస్టాఫీసుకు బదలాయించింది. దీంతో రైల్వే అధికారులు సర్క్యులర్ బజార్ కింది ఫ్లోర్‌లో మూడు షాపుల్లో నిర్వహిస్తున్న రిజర్వేషన్ కౌంటర్‌ను ఎత్తివేస్తూ అందులోని సామగ్రిని తరలించుకుపోయారు. సర్క్యులర్ బజార్‌కు కూత వేటు దూరంలోని హెడ్ పోస్టాఫీసులో రైల్వే రిజర్వేషన్ సేవలు యథాతథంగా కొనసాగనున్నాయి.

సేవలు విస్తృతమైన వేళ

అమలాపురంలో రైల్వే రిజర్వేషన్ కౌంటర్‌ను ఈ శాఖ ఉపసంహరించుకోవడంపై కోనసీమకు రైలు రాకను ఆకాంక్షించే వారంతా వ్యతిరేకించారు. కొందరు నాయకులు ధర్నాలు సైతం చేసి కనీసం కోనసీమకు రైలు వచ్చే వరకైనా కౌంటర్‌ను కొనసాగించాలని డిమాండ్ చేశారు. సీనియర్ సిటిజన్స్, నిరక్షరాస్యులు ఈ కౌంటర్ సేవలు వినియోగించుకుంటున్న మాట వాస్తవం. అయితే ప్రస్తుతం రైల్వే రిజర్వేషన్ సేవలు స్మార్ట్ ఫోన్లలోకి సైతం వచ్చేశాయన్నది రైల్వే అధికారుల వాదన. అలాగే వార్డు, గ్రామ సచివాలయాలు ద్వారా కూడా రిజర్వేషన్లు చేసుకునే వెసులబాటు ఉంది. అలాగే పోస్టాఫీసుల ద్వారా సైతం సేవలను పొందే అవకాశముంది. కాకపోతే రైల్వే శాఖ ఆధ్వర్యంలో కౌంటర్ నడిచినప్పుడు ఆదివారం కూడా అందుబాటులో ఉండేది. ఇప్పుడు హెడ్ పోస్టాఫీసుకు మార్చడం వల్ల ఆ రోజు సేవలు అందవు. ఇది ఒక్క అసౌర్యం తప్ప మిగిలిన సమయాల్లో రైల్వే టిక్కెట్ల రిజర్వేషన్ పొందే అవకాశాలు పలు రూపాల్లో అందుబాటులోకి వచ్చాయి. అయినా జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, అమలాపురం ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావులు అమలాపురంలోనే రైల్వే శాఖ టిక్కెట్ల రిజర్వేషన్ కౌంటర్‌ను కొనసాగించేందుకు ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. హెడ్ పోస్టాఫీసులోకి రిజర్వేషన్ కౌంటర్ మార్చిన తర్వాత రోజుకు 20 నుంచి 30 మంది వరకూ రైల్వే వినియోగదారులు వచ్చి టిక్కెట్ రిజర్వేషన్లు చేయించుకుంటున్నారు.

కౌంటర్ పనితీరును పరిశీలిస్తున్నాం

తమ హెడ్ పోస్టాఫీసుకు తరలించిన రైల్వే రిజర్వేషన్ కౌంటర్‌కు రోజుకు ఎంత మంది వస్తున్నారనే దానిపై నిత్యం పరిశీలిస్తున్నాం. ఇప్పటికే తమ పోస్టాఫీసులో రైల్వే రిజర్వేషన్ సేవల వెసులబాటు ఉంది. అయితే రైల్వే శాఖ నుంచి తమ కార్యాలయానికి బదలాయించిన కౌంటర్‌కు, గతంలో తాము అందించే సేవల కౌంటర్‌కు ఎంతెంతమంది వినియోగదారులు వస్తున్నారనే దానిపై అధ్యయనం చేస్తున్నాం.

– సలాది శ్రీధర్, సూపరింటెండెంట్, డివిజనల్ ప్రధాన తపాలా కార్యాలయం, అమలాపురం

అర్హులందరికీ సంక్షేమ పథకాలు


భైరవలంకలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

- ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్
- భైరవలంకలో గడప గడపకూ మన ప్రభుత్వం

ఐ.పోలవరం: రాష్ట్రంలో కుల, మత, వర్గ పార్టీ బేధం లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. ఐ.పోలవరం మండలం గోగుల్లంక శివారు భైరవలంకలో ఆదివారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ వారికి అందుతున్న సంక్షేమ లబ్ధిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ మాట్లాడుతూ ప్రజలను ధైర్యంగా ఓటు హక్కు అడిగే సత్తా వైఎస్సార్ సీపీకే ఉందన్నారు. ప్రభుత్వం అందరికీ మేలు చేస్తూ ముందుకెళుతుంటే ప్రతిపక్ష పార్టీలు లేనిపోని విమర్శలు చేస్తున్నాయన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ ద్వారా పారదర్శకంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నారన్నారు. మధ్యవర్తులతో ప్రమేయం లేకుండా ఒక్క బటన్ నొక్కి నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మోర్త మిరియంజ్యోతి, జెడ్పీటీసీ ముదునూరి సతీష్‌రాజు, మండలపార్టీ కన్వీనర్ పిన్నమరాజు వెంకటపతిరాజు, గ్రామ సర్పంచ్ కాకర్లపూడి గీతా వాసురాజు, ఢిల్లీ నారాయణ, వెండా వెంకన్న, కసిలంక నరసింహమూర్తి, పిన్నమరాజు బాబ్జిరాజు, ఈతకోట సత్యనారాయణ, సఖిలే వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

టౌన్ బ్యాంక్ లాభం రూ.1.30 కోట్లు



మహాజన సభలో మాట్లాడుతున్న బ్యాంక్ చైర్మన్ వెంకట సూర్యనారాయణ

అమలాపురం టౌన్: అమలాపురం కో ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ గత మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో రూ.84 కోట్ల మేర వ్యాపారం చేసి రూ.1.3 కోట్ల మేర లాభాలను ఆర్జించిందని ఆ బ్యాంక్ చైర్మన్ డాక్టర్ మెట్ల వెంకట సూర్యనారాయణ వెల్లడించారు. స్థానిక కాపు కల్యాణ మండపంలో ఆదివారం జరిగిన టౌన్ బ్యాంక్ 25వ వార్షిక మహాజన సభకు చైర్మన్ వెంకట సూర్యనారాయణ అధ్యక్షత వహించి మాట్లాడారు. బ్యాంక్‌లో రూ.48 కోట్ల మేర డిపాజిట్లు ఉన్నాయని చెప్పారు. వివిధ రంగాలకు బ్యాంక్ ద్వారా రూ.35 కోట్ల మేర రుణాలు అందజేశామని వివరించారు. ఈ సంవత్సరం బ్యాంక్ సభ్యులకు 13 శాతం డివిడెండ్లను ప్రకటించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా 2022–23 బ్యాంక్ ఆడిట్ నివేదికను, 2023–24 సంవత్సరానికి అంచనా బడ్జెట్‌ను బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ శిరగం వేణుగోపాలరావు ప్రవేశపెట్టగా మహాజన సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. మహాజన సభలో బ్యాంక్ వైస్ చైర్మన్ ఎండీ అమీర్, డైరెక్టర్లు మెట్ల రమణబాబు, డాక్టర్ బి.రాఘవేంద్రరావు, జాన్‌పాల్, చింతా శంకరమూర్తిన, అల్లాడ శ్రీనివాస్, డాక్టర్ గొలకోటి రంగారావు, బ్యాంక్ మేనేజర్ చిక్కం బాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలి


క్రికెట్ టోర్నీ ప్రారంభంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

యానాం: గ్రామీణ ప్రాంత క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించేలా తమ క్రీడా నైపుణ్యాలను మెరుగు పరుచుకోవాలని మాజీ మున్సిపల్ చైర్మెన్ గిడ్ల చంద్రరావు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక దరియాలతిప్ప అంబేడ్కర్ ఆడిటోరియం మైదానంలో నిర్వహించే జైభీమ్ క్రికెట్ టోర్నీ ప్రారంభం సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. యానాం నియోజకవర్గంలో అధునాతనంగా నిర్మించిన వైఎస్సార్ ఇండోర్ స్టేడియం, బాలయోగి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వారం రోజుల పాటు నిర్వహించే ఈ క్రికెట్ టోర్నీలో వివిధ ప్రాంతాల నుంచి 30 జట్లు పాల్గొంటున్నాయని నిర్వాహకులు తెలిపారు. అంతకుముందు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు తిరుకోటి నాగేశ్వరరావు, మోకా బుజ్జి, కన్నీడి అప్పారావు, చోడే సుబ్బారావు, గెడ్డం వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

గోదావరిలో.. ప్రమాదం అంచున..


రాజీవ్ రివర్ బీచ్‌లో గౌతమీ గోదావరిలో దిగి ఆడుతున్న పెద్దలు, చిన్నారులు

యానాం: నియోజకవర్గ పరిధిలోని ప్రముఖ పర్యాటక కేంద్రం రాజీవ్ రివర్ బీచ్ వద్దకు వచ్చే సందర్శకులు హెచ్చరిక బోర్డులను పట్టించుకోకుండా గౌతమీ గోదావరిలోకి వెళుతున్నారని తక్షణం పోలీస్‌శాఖ చర్యలు తీసుకోవాలని ఆదివారం పలువురు స్థానికులు కోరారు. ఆదివారం సెలవు రోజు కావడంతో అధిక సంఖ్యలో సందర్శకులు రాజీవ్ రివర్ బీచ్, జీసస్ స్టాట్యూ తదితర ప్రాంతాలను సందర్శించి కొద్దిసేపు గడిపారు. ఈ నేపథ్యంలో పలువురు తమ పెద్దలు, చిన్నారులు సైతం లోతుగా ఉండే ప్రాంతాల్లో సైతం గోదావరి నదిలోకి దిగి ఆటలాడారు. గతంలో ఇదేవిధంగా పలువురు పర్యాటకులు ప్రమాదాల బారిన పడ్డారని, సందర్శకులు నిబంధనలు పాటించేలా చూడాలని సీనియర్స్ సిటిజన్స్ కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక


కందికుప్ప జెడ్పీ హైస్కూలులో ఆత్మీయ కలయికలో పాల్గొన్న 1984–85 బ్యాచ్ విద్యార్థులు

కాట్రేనికోన: కందికుప్ప జెడ్పీహెచ్ పాఠశాలలో చదువుకున్న 1984–85 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ కలయిక ఏర్పాటుచేసుకున్నారు. సుమారు 38 ఏళ్ళ తరువాత పూర్వ విద్యార్థులంతా తాము చదువుకున్న పాఠశాలలోనే కలుసుకుని ఒక్కసారిగా చిన్నపిల్లలైపోయారు. ఒకరినొకరు పలకరించుకుంటూ చిన్ననాటి సంగతులను గుర్తు చేసుకుంటూ రోజంతా ఉత్సాహంగా గడిపారు. ఎవరెవరు ఎక్కడెక్కడ స్థిరపడ్డారో, వారి పిల్లల విద్య, ఉద్యోగాల పరిస్థితుల్ని ఒకరినొకరు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన మల్లా వీర్రాఘవ మాస్టారుని ఘనంగా సత్కరించుకున్నారు. ఆత్మీయ కలయికలో పూర్వ విద్యార్థులు జీటీ వెంకటేశ్వరరావు, కాశి శ్రీనివాస్, అప్పారి సత్యపరమేశ్వరరావు, పాలెపు ధర్మారావు, బూల చక్రవర్తి, బొజ్జా అప్పారావు, జి.జయశంకర్, అర్దాని కాసుబాబు, నాతి గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

అప్పనపల్లిని ఆధ్యాత్మికంగా తీర్చిదిద్దుతాం


అప్పనపల్లిలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి ఆలయాన్ని మరింత ఆధ్యాత్మికంగా తీర్చుదిద్దుతామని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. రాజమహేంద్రవరానికి చెందిన శిల్పి స్వర్గీయ పిల్లేడ నరసింహాచార్యులు, కూర్మాచార్యుల జ్ఞాపకార్థంగా కోమలాచార్యులు నిర్మించిన బాలబాలాజీ స్వామి వారి ఆలయ ప్రాంగణంలో నిర్మించిన శంఖుచక్ర నామాలను ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. రూ.1.50 లక్షలతో వీటిని ఏర్పాటు చేశారు. చిట్టిబాబు మాట్లాడుతూ అప్పనపల్లి ఆలయ అభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారం మరువరానిదన్నారు. ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, జెడ్పీటీసీ కసిరెడ్డి ఆంజనేయులు, ఆలయ ఈఓ జి.మాధవి, సర్పంచ్ గెడ్డం మంగాలక్ష్మి, ఎంపీటీసీ బొంతు నీలిమ, ట్రస్ట్ బోర్డు సభ్యులు చిట్టాల సత్తిబాబు, కొమ్ముల సూరిబాబు, పెదమల్లు ఉషారాణి, బత్తుల గంగారత్నం, గూటం శ్రీనివాస్, బొరుసు పార్వతి దుర్గాభవాని పాల్గొన్నారు.

శరవేగంగా 'జీరో' షూటింగ్


మెర్లపాలెంలో షూటింగ్ నిర్వహిస్తున్న చిత్రబృందం

ఆత్రేయపురం: కోనసీమ సొగసులు వెండి తెరపై తళతళమని మెరవనున్నాయి. ఆత్రేయపురం మండలంలోని వివిధ గ్రామాల్లో జీరో సినిమా చిత్రీకరణ కోనసీమ అందాల నడుమ సుమారు 10 రోజుల పాటు ఒక సినిమాను తెరకెక్కించేందుకు వచ్చారు. హీరో విజయ్ రాజ్, హీరోయిన్ ఎల్సా, తారాగణం రాజేంద్ర ప్రసాద్, ఆమని, సంపత్‌రాజ్, తదితరులు నటించనున్నారు. సాయివిలాస్ బ్యానర్ నిర్మిస్తుండగా నిర్మాతగా లక్ష్మణరావు, కోడైరెక్టర్ శివ, సంగీతం సాయి కార్తిక్ అందించనున్నారు. ఈ చిత్ర నిర్మాణం ఇప్పటి వరకు 50 శాతం పూర్తయినట్లు డైరెక్టర్ లక్ష్మీనారాయణ తెలిపారు. శుక్రవారం మండలంలోని మెర్లపాలెం, లొల్ల తదితర గ్రామాల్లో చిత్రీకరించారు. ప్రసిద్ధి చెందిన ఆత్రేయపురం పూతరేకులు, పల్లె వాతావరణంపై చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

జలజీవన్ మిషన్ కేంద్ర బృందం పర్యటన



ఇసుకపూడిలో తాగునీటి స్వచ్ఛతపై ఆరా తీస్తున్న కేంద్ర బృందం

అంబాజీపేట: జాతీయ జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా అంబాజీపేట మండలంలో ప్రజలకు అందిస్తున్న తాగునీటి స్వచ్ఛత, శుద్ధిపై కేంద్ర బృందం నాలుగు గ్రామాల్లో ఆదివారం పర్యటించి వివరాలను సేకరించింది. ఇసుకపూడి, కముజువారిలంక, పసుపల్లి, తొండవరం గ్రామాల్లో ప్రజలకు సరఫరా చేస్తున్న తాగునీటి శుభ్రతను కేంద్ర బృందం ప్రతినిధులు గజాన్‌ఫర్ అహ్మద్, రాజ్‌కుమార్ బన్సాల్ పరిశీలించి గ్రామ సభలు నిర్వహించారు. జలజీవన్ మిషన్ ద్వారా పంపిణీ చేస్తున్న తాగునీరు రంగు మారిందా, వాసన వస్తుందా, తాగునీరు సరఫరా చేసే ప్రాంతాల వద్ద పరిశుభ్రత పాటిస్తున్నారా అని స్థానిక మహిళలను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి అవసరాలకు సరఫరా చేస్తున్న తాగునీటిలో మూలకాలను పరీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు తరపట్ల మోహన్‌సింగ్‌బాబురావు, సరస్వతుల సుబ్రహ్మణ్య ప్రసాద్, మట్టపర్తి నాగరాజు, పేరాబత్తుల దొరబాబు, ఎంపీటీసీ ముత్తాబత్తుల ప్రశాంత్, సొసైటీ అధ్యక్షుడు బొంతు శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ పద్మనాభం, ఏఈఈలు కళ్యాణ్ చక్రవర్తి, చలమయ్య తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న నిత్యాన్నదానానికి విరాళాలు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి విరాళాలు అందినట్లు ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. కొత్తపేటకు చెందిన ఎం.వీవీ సత్యనారాయణమూర్తి–లక్ష్మి నరసమ్మ దంపతులు రూ.10,116, కొంతమూరు గ్రామానికి చెందిన ఎం.వెంకటశేషప్రసాద్–నాగమణి దంపతులు రూ.15 వేలు, హైదరాబాద్‌కు చెందిన ఐ.వెంకట కృష్ణంరాజు, అవంతి దంపతులు రూ10,011, రాజమహేంద్రవరానికి చెందిన జె.శేషలత రూ.10,116, విరాళాలు అందించినట్లు తెలిపారు. దాతలకు ఆలయ ఈఓ. చేతుల మీదుగా స్వామి చిత్రపటం అందించారు.

నిత్యాన్నదానానికి రూ.50 వేల విరాళం


దాత రమణమూర్తికి స్వామి చిత్రపటం అందజేస్తున్న ఆలయ ప్రధానార్చకుడు

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్ పటాన్‌చెరుకు చెందిన రమణ టూర్స్, ట్రావెల్స్ యజమాని రాయుడు వీవీ రమణ మూర్తి ఆదివారం రూ.50 వేలు విరాళంగా అందజేశారు. ఈ సొమ్మును చెక్ రూపంలో ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణమూర్తికి అందజేశారు. దాతను వేదపండితులు వేదాశీర్వచనం, స్వామివారి శేషవస్త్రాలు సత్కరించి స్వామి చిత్రపటం అందజేశారు.

యానాం డీటీగా మణిమారన్ నియామకం

యానాం: యానాం సబ్‌తాలూకా ఆఫీసు రెవెన్యూ శాఖ డిప్యూటీ తహసీల్దార్‌గా పి.మణిమారన్‌ను నియమిస్తూ ఆదివారం డిపార్ట్‌మెంట్ ఆఫ్ రెవెన్యూ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ డిప్యూటీ కలెక్టర్ ఎం.ఎం.వినయరాజ్ ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటివరకూ ఆ స్థానంలో కొనసాగిన సి.గణేషన్ విధుల నిర్వహణలో అలసత్వం కారణంగా సస్పెన్షన్‌కు గురైన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి డిప్యూటీ తహసీల్దార్ లేక ధ్రువీకరణ పత్రాల జారీ తదితర పనులకు ఆటంకమేర్పడింది. దీంతో నూతన డిప్యూటీ తహసీల్దార్‌ను నియమించారు. ప్రస్తుతం మణిమారన్ పుదుచ్చేరి పాప్కో శాఖలో విధులు నిర్వహిస్తున్నారు. అదేవిధంగా పుదుచ్చేరివ్యాప్తంగా 13 మంది రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లకు డిప్యూటీ తహసీల్దార్‌లుగా పదోన్నతులు కల్పించి వివిధ ప్రాంతాల్లో నియమించి జులై 14లోగా రిపోర్ట్ చేయాలని ఆదేశించారు.

బీజేపీ యువ మోర్చా నేతల రక్తదానం


రక్తదానం చేస్తున్న బీజేపీ యువ మోర్చా నాయకులు

అమలాపురం టౌన్: అమలాపురం బీజేపీ యువ మోర్చా ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో పది మంది రక్తదానం చేశారు. బీజేపీ యువ మోర్చా నాయకుడు యల్లమిల్లి నాగ సుధ కొండలరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ రక్తదాన శిబిరానికి పార్టీ జాతీయ కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యుడు నల్లా పవన్‌కుమార్ పాల్గొని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తొమ్మిదేళ్ల పాలనపై ప్రశంసలు కురిపించారు. కార్యక్రమంలో బీజేపీ యవ మోర్చా అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ అయ్యల భాస్కరరావు, పార్టీ నాయకులు ఈవని విశ్వేశ్వరశర్మ, కటికిరెడ్డి గంగాధర్, దాకే వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్ ఆఫీసర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

యానాం: పుదుచ్చేరివ్యాప్తంగా నాలుగు రీజియన్లలోను వివిధ ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఖాళీగా ఉన్న 105 నర్సింగ్ పోస్టుల భర్తీకి అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డైరెక్టరేట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ సర్వీసెస్ డైరెక్టర్ డాక్టర్ జి.శ్రీరాములు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. నర్సింగ్ ఆఫీసర్(గ్రూప్–బి టెక్నికల్, నాన్ గెజిటెడ్) పోస్టులను విద్యార్హతలు, రిజర్వేషన్లు తదితర నిబంధనల మేరకు భర్తీ చేస్తామన్నారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను పంపడానికి జులై 1వ తేదీ నుంచి ప్రభుత్వ వెబ్‌సైట్లను సందర్శించాలన్నారు. జులై 15 తుది గడువుగా నిర్ణయించినట్లు తెలిపారు.

త్వరలో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం

యానాం: నీట్ మెరిట్ జాబితా విడుదలయిన వెంటనే సెంటాక్(సెంట్రలైజ్డ్ అడ్మిషన్ కమిటీ) సైతం తక్షణం ఎంబీబీఎస్, బీడీఎస్ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభిస్తుందని సంబంధిత అధికారులు ఆదివారం తెలిపారు. ఈ ఏడాది యానాం, పుదుచ్చేరి, మాహే, కారైకల్ నుంచి 5,714 మంది యూజీ, నీట్ పరీక్షకు హాజరైతే 3,140 మంది అర్హత సాధించారన్నారు. పాస్ పర్సంటేజ్ సైతం 54.90 శాతంగా ఉందని, గతేడాది కంటే 2.11 శాతం పెరిగిందన్నారు. అశోక్‌కుమార్ అనే విద్యార్థి 700 మార్కులు సాధించి ఆల్ ఇండియాలో 287 ర్యాంకు సాధించి టాపర్‌గా నిలిచాడని చెప్పారు. నీట్ పాస్ జాబితా హార్డ్ డిస్క్ ద్వారా కేంద్రం పంపిస్తుందని, అది వచ్చిన వెంటనే డైరెక్టర్ ఆఫ్ హెల్త్ పాస్‌వర్డ్ ద్వారా జాబితా విడుదలవుతుందన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

తాళ్లరేవు: జాతీయ రహదారి 216లోని చొల్లంగి జగనన్న లేఅవుట్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులకు తీవ్ర గాయాలైనట్లు కోరంగి ఎస్ఐ పి.శ్రీనివాసకుమార్ తెలిపారు. ఆదివారం ఆయన చెప్పిన వివరాల ప్రకారం శనివారం రాత్రి చొల్లంగి గ్రామానికి చెందిన గంపల మణికంఠ బైక్‌పై కాకినాడ వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా, యానాం నుంచి వస్తున్న మరో బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మణికంఠతో పాటు తండ్రీకుమారులైన చందక అప్పారావు, చందక కుమార్‌లకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు హుటాహుటీన కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసకుమార్ తెలిపారు.